ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 256

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
12 అక్టోబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

### సచివాలయ ఆవరణలో రెచ్చిపోతున్న కుక్కలు

- సందర్శకులపై దాడులు..
- జీహెచ్ఎంసీ అధికారుల చోద్యం..



2 లో

# సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేయండి

- బీసీ రిజర్వేషన్లపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- న్యాయ సలహాలు స్వీకరిస్తున్న ఎన్నికల సంఘం

2 లో



## బనకచర్లను అడ్డుకుని తీరుతాం

- హరీశ్‌రావుది అసత్య ప్రచారం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

2 లో



## వైద్య విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్..

- ఆర్జీకర్ ఘటనను మరువకముందే బెంగాల్‌లో మరో దారుణం
- దుర్గాపూర్ మెడికల్ కాలేజీ వెలుపల ఘటన
- మమతా బెనర్జీ సర్కారుపై ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం

2 లో




### వాటాలున్నాయా? మూటలందాయా?

# నీటి హక్కులపై మాట్లాడవేం?

- బనకచర్లపై మౌనమెందుకు రేవంత్?
- బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే మొద్దునిద్ర పోతున్నవ్
- టెక్నో ఎకనామికల్ అప్రైజల్ కోసం బనకచర్ల పీఎఫ్ఆర్
- వచ్చిందని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి పాటిల్ లేఖ
- కర్ణాటక, మహారాష్ట్ర తమ అభ్యంతరాలు చెప్పినయ్
- మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?
- కర్ణాటకకు పోయి ఆల్ ఈజ్ వెల్ అనుకుంట వచ్చినవ్
- ఆల్మట్టి ఎత్తు పెంచొద్దని ఒక్క మాట చెప్పకపోతివి?
- బనకచర్లపై మీరు వెళ్లకున్నా మేం సుప్రీంకోర్టుకు పోతం
- తెలంగాణభవన్‌లో మీడియాతో మాజీ మంత్రి హరీశ్

2 లో



# సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేయండి

**ఏఎం న్యూస్, హైదరాబాద్:**
ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేదని హైకోర్టు చెప్పినప్పటికీ 42 శాతం రిజర్వేషన్ల అమలుపై స్టే ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడానికే ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అధికారులతో సమావేశం నిర్వహించి హైకోర్టు తీర్పుపై చర్చించారు. రిజర్వేషన్‌లు అమలు చేయాలంటే సుప్రీంకోర్టును ఆశ్రయించడం మినహా మరో దారి లేదన్న అభిప్రాయం వ్యక్తం కావడంతో ఎస్ఎల్పీ దాఖలు చేయడానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లతో ఎన్నికలకు వెళ్లాలన్న స్థిర నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం... సుప్రీంకోర్టులో పటిష్ఠ వాదనలు వినిపించడానికి రంగం సిద్ధం చేస్తోంది. ఎస్ఎల్పీ రూపకల్పనను సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదుల ద్వారానే చేపట్టాలని నిర్ణయించింది. బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించేముందు ట్రిపుల్ టెస్ట్ నిర్వహించాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి జనాభా లెక్కలను సేకరించి రిజర్వేషన్‌లు కల్పించామన్న వాదనను బలంగా ముందుకు తీసుకెళ్లనుంది. రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న దానికి మినహాయింపులపై దృష్టి సారించనుంది. ఈమేరకు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డితోపాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదుల ద్వారా ఎస్ఎల్పీ దాఖలు చేయడానికి సన్నాహాలు పూర్తి చేసింది. ఇప్పటికే తీర్పు ప్రతితోపాటు అవసరమైన పత్రాలను దిల్లీకి పంపినట్లు సమాచారం. సుప్రీంకోర్టు నిర్ణయంపైనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆధారపడి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యాయ సలహాలు స్వీకరిస్తున్న ఎన్నికల సంఘం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లపై హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఏం చేయాలన్నదానిపై రాష్ట్ర ఎన్నికల సంఘం న్యాయనిపుణులను సంప్రదిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ జీవో 9, తదనంతర ఎన్నికల ప్రక్రియ నిమిత్తం జారీ చేసిన 41, 42 జీవోల అమలును మాత్రమే నిలిపివేస్తున్నట్లు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉంది. అంతేగాకుండా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడంలేదని తేల్చి చెప్పింది. 50 శాతం రిజర్వేషన్‌లు మించకుండా మిగిలిన సీట్లను దామాషా పద్ధతిలో ఓపెన్ కేటగిరీ కింద పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు కొనసాగించుకోవచ్చని తెలిపింది. అయినా రిజర్వేషన్‌ల అమలుపై మళ్లీ సందిగ్ధత మొదలవుతోంది. ఇప్పటికే 42 శాతం రిజర్వేషన్‌ల ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో పంచాయతీలు, వార్డుల కేటాయింపు జరిగింది. ఇలా విభజించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. వార్డుల విభజన జరిగాక ఎన్నికల సంఘానికి ప్రభుత్వం పంపిన వివరాల ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తుంది. అయితే ఇక్కడ ఎన్నికల నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోలేదని హైకోర్టు స్పష్టత ఇచ్చినప్పటికీ ముందుకెళ్లలేని పరిస్థితి ఎన్నికల సంఘానిది. అందువల్ల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏం చర్యలు చేపట్టాలన్నదానిపై, అనుసరించాల్సిన విధానంపై రాష్ట్ర ఎన్నికల సంఘం పలువురు సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతోంది. న్యాయనిపుణుల నుంచి అభిప్రాయాలు వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## మానసిక ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం..

సమష్టి భాగస్వామ్యంతో ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులేద్దాం
టెలీ మానస్ ద్వారా అత్యంత నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు
దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో సేవలు
మానసిక సమస్యలను సకాలంలో గుర్తించి సరైన చికిత్స
మానసిక ఆరోగ్య రంగంలో ఇండ్లాస్ సేవలు ప్రశంసనీయం
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,అక్టోబర్ 11:**
మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషిచేద్దామని.. దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మానసిక ఆరోగ్యానికి భరోసా కల్పించే వివిధ కార్యక్రమాలతో పాటు వైద్య సేవలు అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో ఇండ్లాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మంత్రి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులతో కలిసి 'మెంటల్ హెల్త్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లతో ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 97 కోట్ల మంది వివిధ రకాల మానసిక రుగ్మతలకు గురైనట్లు వెల్లడించారు. మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు ఏటా ట్రిలియన్ డాలర్లు మేర నష్టం వాటిల్లుతోందన్నారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రజలు మానసిక ఆరోగ్య సమస్యల బారినపడుతున్నారని.. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో 14-24 శాతం మంది గురవుతున్నట్లు తెలిపారు. మానసిక రుగ్మతలు, ఒత్తిళ్ల వల్ల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. సమాజానికి వెలకట్టలేని వైద్యసేవలందిస్తున్న మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టుల కొరత వుందని, ఆ కొరత తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని.. ఇండ్లాస్ హాస్పిటల్‌లో క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభమైనట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో లేని విధంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో టెలీ మానస్ ద్వారా మానసిక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రతి జిల్లాలోనూ మెంటల్ హెల్త్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. దేశ వ్యాప్తంగా 27 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ఇస్తే మన రాష్ట్రానికి ఒక కేంద్రం వచ్చిందని, విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ అయిందన్నారు. మానసిక ఆరోగ్య రంగంలో నిపుణుల కొరత తీర్చేందుకు కోర్సులు, ప్రవేశాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సకాలంలో మానసిక రుగ్మతలను గుర్తించి.. సరైన చికిత్స అందించడం ముఖ్యమని, ఈ దిశగా సమష్టి కృషి, భాగస్వామ్యం అవసరమని, మానసిక వైద్య రంగంలో డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి చేస్తున్న కృషిని అభినందిస్తున్నామని, ఆయన అనుభవాన్ని, సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ‡ల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర సాకారానికి ఆరోగ్యాంధ్ర కీలకమని, ప్రజలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడే యోగాపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించిందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇండ్లాస్ డైరెక్టర్ డా. విశాల్.. ప్రజల్లో మానసిక సమస్యలు పెరుగుతుండటానికి కారణాలు, వాటిని ఎదుర్కొంటూ ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తాము ఈ రంగంలో ప్రామాణిక వైద్య సేవలు అందించే దిశగా ముందడుగు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వి.రాధికారెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డా. శ్రీహరిరావు, లండన్‌కు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డా. కృష్ణారెడ్డి, కంటి వైద్య నిపుణులు డా. ఇండ్ల స్వప్న, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐఎంఏ - విజయవాడ అధ్యక్షులు డా. హనుమయ్య, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

### వాటాలున్నాయా? మూటలందాయా?

# నీటి హక్కులపై మాట్లాడవేం?

**ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ చేసిన హెచ్చరికలు ఒకొకటిగా నిజమవుతున్నయి. తెలంగాణ పాలిట బనకచర్ల పెను ప్రమాదంగా మారబోతున్నా ముఖ్యమంత్రి నోరెత్తుతలేడు. నీ కమీషన్ల కోసం మౌనంగా ఉంటున్నవా? కాంట్రాక్టుల్లో వాటా ఉన్నదా? ఎందుకు మౌనంగా ఉంటున్నవ్ రేవంత్‌రెడ్డీ?**

**ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 11 :**
కేంద్రంలోని బీజేపీ సహకారంతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ ఏపీ ప్రభుత్వం ముందుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్టుగా ఉంటూ ఏపీకి పూర్తిగా సహకరిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. టెక్నో ఎకనామికల్ అప్రైజల్ కోసం బనకచర్ల ప్రాజెక్టు పీఎఫ్ఆర్ వచ్చిందని, అనుమతుల ప్రక్రియ ప్రోగ్రెస్‌లో ఉన్నదని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సెప్టెంబర్ 23న సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారని, 20 రోజులైనా దాన్ని వ్యతిరేకించాల్సింది పోయి పరోక్షంగా సహకరిస్తున్నారని నిప్పులు చెరిగారు. మన దేశంలో వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ ఉండదని, నికర జలాల మీద డీపీఆర్ ఉంటుందని, కానీ వరద జలాల మీద ఉండదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), నదీ జలాల పంపిణీ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్‌ను వ్యతిరేకిస్తూ కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి లేఖ రాస్తే రేవంత్‌రెడ్డి మాత్రం మౌనంగా ఉన్నారని ధ్వజమెత్తారు. తెలంగాణభవన్‌లో శనివారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దాసోజు శ్రవణ్‌తో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి పాటిల్ రాసిన లేఖను, మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు కేంద్రానికి పంపిన లేఖలను మీడియాకు చూపించారు. బనకచర్ల పురోగతి.. తాజా పరిణామాలను మీడియా సాక్షిగా ప్రజల ముందు బయట పెడుతున్నానని చెప్పారు. బనకచర్ల డీపీఆర్ కోసం రూ.9కోట్లకు ఏపీ సర్కారు టెండర్లు కూడా పిలిచిందని, అయినా మన సీఎం మొద్దునిద్ర పోతున్నారని విమర్శించారు.

112 టీఎంసీలు ఆపుకొంటామంటున్న కర్ణాటక..

మొత్తంగా 423 టీఎంసీలు ఏపీ తీసుకువెళ్తే మేము 112 టీఎంసీల నీళ్లు కృష్ణాలో ఆపుకొంటామని కర్ణాటక ప్రభుత్వం కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖకు లేఖ రాసిందని హరీశ్ వివరించారు. ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్ ప్రకారం గోదావరి నీళ్లు తరలించుకుంటే మరుసటి రోజు నుంచి కృష్ణా మీద నీళ్లు ఆపుతామని చెప్పిందని తెలిపారు. అంటే 423 టీఎంసీల గోదావరి జలాలు ఏపీ అర్పణం, 112 టీఎంసీల కృష్ణా జలాలు కర్ణాటకకు అర్పణమైతే తెలంగాణ మిగిలేదేమిటని ఆయన ప్రశ్నించారు.

ప్రాజెక్టులు కడతామంటున్న మహారాష్ట్ర..

బనకచర్ల టెక్నో ఎకనామికల్ అప్రైజల్‌పై మహారాష్ట్ర తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖరాసిందని హరీశ్ చెప్పారు. వరద జలాల మీద ప్రాజెక్టు నిబంధనలు దేశంలో లేవని, ఒకవేళ ఉంటే తాము కూడా కట్టుకుంటామని పేర్కొన్నట్టు వెల్లడించారు. 'అసలు ఫ్లడ్ వాటర్ మీద ముందుకు వెళ్ల కూడదు. ఒకవేళ వెళ్తే మహారాష్ట్ర వాటా ఎంతో చెప్పండి. వరద జలాల మీద ప్రాజెక్టు కట్టేందుకు ఏపీకి అవకాశం ఇస్తే మేము కూడా కట్టుకునేందుకు డీపీఆర్లు పంపుతం. కృష్ణాలో 74 టీఎంసీల మా వాటా ఆపుకొంటం. వరద ప్రాజెక్టులు కడుతం. విదర్భకు నీళ్లు తీసుకుపోతం' అని మహారాష్ట్ర కేంద్రానికి రాసిన లేఖ పేర్కొన్నదని వివరించారు. 'కర్ణాటక 112 టీసీఎంల నీళ్లు ఆపుకొంటామంటది. మహారాష్ట్ర కూడా కృష్ణాలో 74 టీఎంసీలు ఆపుకొంటామంటది. గోదావరిపై ప్రాజెక్టు కట్టి విదర్భకు నీళ్లు తీసుకుపోతామంటున్నది. తెలంగాణ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఇంత స్పష్టంగా ఆయా రాష్ట్రాలు ముందుకు పోతుంటే మన ప్రభుత్వం ఏం చేస్తున్నది? మొద్దు నిద్ర పోతున్నదా?' అని నిలదీశారు.

కేంద్రం ఎందుకు మాట్లాడదు?

పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు సా ధ్యం కాదని సెంట్రల్ వాటర్ కమిషన్, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇప్పటికే స్పష్టం చేశాయని హరీశ్ గుర్తుచేశారు. అప్పుడు తప్పు అని చెప్పిన కేంద్రం.. ఇప్పుడు ఎందుకు ముందుకు పోతున్నదని ప్రశ్నించారు. 'టెక్నో ఎకనామికల్ అప్రైజల్ ప్రాసెస్‌లో ఉన్నదని కేంద్రం ఎలా చెప్తుంది? సీడబ్ల్యూసీనే వరద జలాలు ఎలా తరలిస్తారని రాసింది. ఈ ఆధారం పట్టుకొని సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడం లేదు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి బాధ్యత లేదా? ఏపీ మన నీళు తన్నుకుపోతుంటే రేవంతరెడ్డి, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పెదవులు మూసుకుంటున్నరు. మాయల ఫకీరు ప్రాణం చిలుకలో ఉన్నట్టు.. కేంద్ర ప్రభుత్వ ప్రాణం చంద్రబాబు చేతిలో ఉన్నందున ఈ రోజు బాబు ఒత్తిడికి బీజేపీ తలొగ్గుతున్నది. పోలవరం జాతీయ ప్రాజెక్టు. దానికి ఇప్పటికే డీపీఆర్ ఉన్నది. కేంద్రం నిర్మించే పోలవరానికి బనకచర్ల పేరిట అడ్డగోలుగా కాల్వలు పెంచితే ఎందుకు కేంద్రం మౌనంగా ఉంటున్నది?' అని నిలదీశారు.

బీజేపీది రాష్ట్రానికో ఒకనీతా?

'టెండర్ బిడ్ డాక్యుమెంట్‌లో పేజీ 79లో ఉన్న దాని ప్రకారం.. పోలవరం రైట్ మెయిన్ కెనాల్ ద్వారా 23వేల క్యూసెకులు మళ్లించేలా రూపకల్పన చేశారు. నిజానికి 11,500 క్యూసెకులు మాత్రమే దాని కెపాసిటీ. ఇప్పుడు 23వేల క్యూసెక్కుల కెపాసిటీతో పోలవరం రైట్ మెయిన్ కెనాల్ తవ్వుతున్నారు. అంటే కేంద్రం ఏం చేస్తున్నది? బీజేపీది రాష్ట్రానికో నీతా? నిబంధనలు ఉల్లంఘించి తవ్వుతుంటే బీజేపీ ఎందుకు నిధులిస్తున్నది? ఆనాడు కెనాల్‌ను 18 వేలకు పెంచితేనే బీఆర్ఎస్ ప్రభుత్వం కొట్లాడింది. కేంద్రం డబ్బులు ఆపింది. రేవంత్ వచ్చాక ఇప్పుడు కెనాల్‌ను 18 వేల నుంచి 23 వేల క్యూసెకులకు పెంచుతున్నది. తవ్వుతున్న ఏపీది తప్పుయితే, సహకరించిన బీజేపీది కూడా తప్పే' అని పేర్కొన్నారు.

మీరు వెళ్లకున్నా మేము సుప్రీంకు పోతం

అడ్డగోలుగా కాలువలు తవ్వి తెలంగాణ నీళ్లను ఏపీ తన్నుకుపోతుంటే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదని హరీశ్ ప్రశ్నించారు. 'న్యాయవాదులతో కేసీఆర్ మాట్లాడుతున్నారు. సీఏ రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లకున్నా రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతది. సుప్రీంకోర్టుకు వెళ్లి హకులను కాపాడుతుంది. తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేసేది బీఆర్ఎస్, కేసీఆర్ మాత్రమే' అని హరీశ్ స్పష్టంచేశారు.

తెలంగాణ సోయి ఉన్న మంత్రి లేడా?

'గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ సర్వస్వం కోల్పోతుంటే రేవంత్‌రెడ్డి సైలెంట్ మోడ్‌లో ఉన్నడు. వరద జలాల మాట దేవుడెరుగు. ఉన్న నీళ్లు పోయేటట్టున్నయి. రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి. ఎన్నడూ జై తెలంగాణ అనలే. ఎన్నడూ అమరుల స్తూపం వద్దకు పోలే. ఒకనాడు రాజీనామా చేయలే. క్యాబినెట్‌లో తెలంగాణ సోయి ఉన్న ఒక మంత్రి కూడా లేడా? ఉత్తరాలు వచ్చిన విషయం వారికి తెల్వదా?' అని హరీశ్ నిలదీశారు.

ఆల్మట్టి ఎత్తు పెంపుపైనా రేవంత్ మౌనం

'బనకచర్లను అడ్డుకోవడం..కృష్ణాలో నీటి వాటాల సాధనలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి..ఆల్మట్టి ఎత్తుపైనా మౌనం వహిస్తున్నడు. మొన్న కర్ణాటకకు పోయి సాధించిందేటి? మీ పార్టీ పెద్ద మల్లికార్జున్ ఖర్గేను కలిసి కనీసం అక్కడి సీఎం సిద్ధరామయ్యకు ఫోన్ చేయించకపోతివి? ఎత్తుపెంచితే తెలంగాణ ఏడారైతది.. జర ఆపండని అడగకపోతివి? అక్కడి నీటిపారుదల శాఖ మంత్రి శివకుమార్‌తో నీకు సఖ్యత ఉన్నది కదా? ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటిన్నమ్మ వాయినం చందంగా ఇద్దరి మధ్య మాటలే కాదు.. మూటల మార్పిడి జరుగుతది కదా? మూటల సంగతి పక్కనబెట్టి ఆల్మట్టి ఎత్తు పెంచొద్దని ఒక్కమాటైనా చెప్పకపోతివెందుకు? ' అంటూ హరీశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకకు పోయి ఆల్మట్టిని మరిచిపోయి ఆల్ ఈజ్ వెల్ అనుకుంటూ వచ్చాడని ఎద్దేవా చేశారు. అయినదానికి, కానిదానికి ఢిల్లీకి పోయి తెలంగాణకు ఒరగబెట్టిందేమిటని నిలదీశారు.

పూటకో మాట..ఘడియకో లెక్క..

రాష్ట్ర నీటిహక్కులపై అవగాహనలేని ముఖ్యమంత్రి.. మంత్రులు పూటకో మాట.. ఘడియకో లెక్క చెప్తున్నారని హరీశ్ ధ్వజమెత్తారు. వారికి పాలమూరు తలాపున పారుతున్న కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తెలియకపోవడం విడ్డూరమని నిప్పులు చెరిగారు. 'ఒకసారి కృష్ణాలో 500 టీఎంసీలు, గోదావరిలో 1000 టీఎంసీలు కేటాయించి ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోండి అని ఏపీ సీఎం చంద్రబాబుకు ఓపెన్ ఆఫర్ ఇస్తరు..ఇంకోసారి కృష్ణాలో 904 టీఎంసీల వాటా కోసం కొట్లాడుతున్నమని పొంకనాలు కొడుతరు.. నీళ్ల మంత్రేమో ఢిల్లీకి పోయి ట్రిబ్యునల్ ముందు 763 టీఎంసీలు అడుగుతున్నమంటరు..ఇలా రోజుకో వైఖరిని ప్రదర్శిస్తూ తెలంగాణ పరువుతీస్తున్నరు' అని విరుచుకుపడ్డారు. 'రాష్ట్ర నీటి హక్కులపై స్పష్టతలేని ఆయన ట్రిబ్యునల్ ఎదుట ఏం వాదిస్తరు? ఏం సాధిస్తరు? రేవంత్‌రెడ్డీ..ఢిల్లీకి ఎప్పుడూ బ్యాగులు మోసుడే కాదు..అప్పుడప్పుడు తెలంగాణ ప్రజల బాగోగులు కూడా చూడు' అంటూ చురకలంటించారు.

ట్రిబ్యునల్ సాధించింది కేసీఆరే..

కాంగ్రెస్ సర్కారు అవగాహనలేమి, అడ్డగోలు వ్యవహారాలతో తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతున్నదని హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ తొమ్మిదేండ్లు పోరాడి నీళ్ల కోసం తండ్లాడి సుప్రీంకోర్టు మెట్లెక్కి ట్రిబ్యునల్‌ను సాధించారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ట్రిబ్యునల్ ప్రకారమే నీళ్ల పంపిణీ చేయాలని కోరారని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలోనే వాదనలు సుగమయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ నీళ్ల వాటాల కోసం అలుపెరగని కృషి చేస్తే రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు ధారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. 'నీటి హక్కులను రాసిస్చేందుకు నువ్వెవరు రేవంత్‌రెడ్డీ? అని నిలదీశారు.

కేసీఆర్ లేకుంటే తెలంగాణకు ఆగం చేస్తరు

తెలంగాణ నీటి హక్కుల కోసం నాటి నుంచి నేటి వరకు పోరాటం చేస్తున్నది కేసీఆర్.. బీఆర్ఎస్సేనని హరీశ్ స్పష్టంచేశారు. ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తున్నదని తమ పార్టీయేనని పునరుద్ఘాటించారు. ఆల్మట్టి ఎత్తు పెంపుపై సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు లాయర్లు, న్యాయనిపుణులతో కేసీఆర్ చర్చలు జరుపుతున్నారని చెప్పారు. 'జాతీయ పార్టీలను గెలిపిస్తే తెలంగాణకు ఒరిగిందేమీలేదు.. కేసీఆర్ లేకుంటే తెలంగాణను ఆగం చేస్తరు..అగాథంలోకి తోస్తరు..అనాథగా మారుస్తరు' అని జాగృతపరిచారు. తెలంగాణకు జల హక్కులు దక్కాలంటే కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను కాపాడుకోవాలని, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు.

నల్లమల పులివా? పిల్లివా? ఎలుకవా? రేవంత్ : హరీశ్

'రేవంత్‌రెడ్డి తొలుత పోను అనుకుంటూనే ఢిల్లీకి పోయి అపెక్స్ మీటింగ్‌లో కూర్చున్నడు. అసలు బనకచర్ల అంశం మీటింగ్ ఎజెండాలోనే లేదు.. కనుక చర్చే జరగలేదని బుకాయించి రాష్ట్ర ప్రజలను మోసం చేసిండు. ఎజెండాలో బనకచర్ల అంశం ఉన్నదని బీఆర్ఎస్ ఆధారాలతో సహా బయటపెట్టింది. ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు అసలు సంగతి బయటపెట్టారు. మీటింగ్‌లో బనకచర్లపై చర్చ జరిగిందని, ప్రాజెక్టు నిర్మాణాన్ని సుసాధ్యం చేసేందుకు కమిటీ ఏర్పాటైందని చెప్పిండ్రు. ఆలిండియా రేడియోలో ఈ వార్త వచ్చింది. దీంతో రేవంత్ నోట్లో పచ్చి వెలకాయ పడ్డది. చేసిన ద్రోహం.. బట్టబయలైంది. కమిటీకి రేవంత్‌రెడ్డి ఒప్పుకోవడమంటేనే బనకచర్లకు ఒప్పుకొన్నట్టు. కమిటీ ఏర్పాటుకు గంగిరెద్దులా తలూపారు. మహారాష్ట్ర, కర్ణాటక రాసిన లేఖలు అబద్ధమా? కేంద్రం నుంచి 20 రోజులుగా ఉత్తరం వస్తే ఎందుకు కౌంటర్ ఇవ్వలేదు. నల్లమల గుండా పోయే కృష్ణా నీళ్లలో అన్యాయం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నవు? నువ్వు నల్లమల పులివా? పిల్లివా? ఎలుకవా?' అని హరీశ్ నిలదీశారు.

## సచివాలయ ఆవరణలో రెచ్చిపోతున్న కుక్కలు

**ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 11 :**
సచివాలయ ఆవరణలో వీధి కుక్కలు విహారం చేస్తున్నాయి. పరిసరాల్లో తిరుగుతూ సందర్శకులు, సిబ్బ ందిపై తరచుగా దాడి చేస్తున్నాయి. ఇప్పటికే నలుగురిపై దాడి చేసిన కుక్కలు శనివారం సాయంత్రం పనిమీద సెక్రటేరియట్‌కు వచ్చిన ఓ మహిళను తీవ్రంగా గాయపరిచాయి. శునకాల బెడదతో అక్కడి రహదారిపై నుంచి వెళ్లేందుకు పాదచారులు, సెక్యూరిటీ సిబ్బంది భయపడుతున్నారు. పెట్రేగిపోతున్న కుక్కలతో ఉద్యోగులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న సచివాలయంలో పరిస్థితిపై అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడదకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## వైద్య విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్..

**కోల్‌కత, అక్టోబర్ 11:**
పశ్చిమబెంగాల్ ఆర్జీకర్ లైంగికదాడి ఘటన మరువకముందే మరో ఘటన చోటుచేసుకుంది. బర్ధమాన్ జిల్లాలో ఒడిశాకు చెందిన ఓ వైద్య కళాశాల విద్యార్థినిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు శనివారం పోలీసులు వెల్లడించారు. దుర్గాపూర్‌లోని ఓ ప్రైవేట్ వైద్య కళాశాల క్యాంపస్ వెలుపల శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భోజనం చేసేందుకు ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తన స్నేహితులతో కలసి బయటకు వెళ్లినపుడు ఈ ఘటన జరిగినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

## బనకచర్లను అడ్డుకుని తీరుతాం

**ఏఎం న్యూస్, (హనుమకొండ) :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకుని తీరుతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల మాతృవియోగం పొందిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని.. ఉత్తమ్ మరో మంత్రి సీతక్కతో కలిసి శనివారం హనుమకొండలో పరామర్శించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడారు. “బనకచర్లపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా తెలంగాణ అభ్యంతరాలు తెలిపాం. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ మేం ఆలమట్టి ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్నాం. బనకచర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కృష్ణా, గోదావరి జలాశయాల్లో తెలంగాణకు నష్టం జరగడానికి కారణం భారాసయే. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై మేం ట్రైబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు వినిపించాం. ఈ విషయంలో రాజీ పడబోం' అని ఉత్తమ్ వివరించారు. సమావేశంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, మాధవరెడ్డి, రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

## అక్రమాలు బయట పడతాయనే భయం

### అందుకే అసెంబ్లీకి మొఖం చాటేస్తున్న జగన్
### అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా మారని నైజం
### ఘాటు విమర్శలు చేసిన అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్

**విజయవాడ,అక్టోబర్ 11:**
అక్రమాలు, అవినీతి బయటపడతాయనే భయంతో ఏపీ అసెంబ్లీకి జగన్ రావడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై అనకాపల్లి ఎంపీ రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తీరుపై విమర్శలు గుప్పించారు. అనకాపల్లిలో ఎంపీ రమేశ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కుర్చీలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీకి వెళ్తే.. తాను సెల్యూట్ కొడతానని స్పష్టం చేశారు. ఇటీవల పులివెందులలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు చూస్తే జగన్‌కి ప్రజా మద్దతు ఎలా ఉందో తెలుస్తోందని విమర్శించారు. గతంలో తమిళనాడులో ఒక్కరే గెలిచిన కరుణానిధి కూడా అసెంబ్లీకి వెళ్లారని గుర్తుచేశారు. గురువారం జగన్‌కి వచ్చిన జనం.. ఒక ఎమ్మెల్యే రోడ్ షో చేసిన కూడా వస్తారని ఎద్దేవా చేశారు. పీపీపీ విధానంలో ఏపీలోని 17 కాలేజీలను నిర్మిస్తే, తన అవినీతి బయటపడుతోందని జగన్ భయపడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉండి జగన్ రాష్ట్రాన్ని ఎంత సర్వనాశనం చేశారో.. ప్రతిపక్షంలో ఉండి కూడా అలాగే వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల పీపీపీ విధానంపై జగన్‌కి కనీస అవగాహన లేదని ఎంపీ రమేశ్ ఆక్షేపించారు. దేశంలో గుజరాత్, యూపీ రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించి జగన్ మాట్లాడాలని హితవు పలికారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుంటే.. జగన్ అండ్ కో అడ్డుకోవాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. ఏపీకి పరిశ్రమలు రాకుండా పారిశ్రామికవేత్తలకు మెయిల్ పంపించి జగన్ అండ్ కో బెదిరిస్తున్నారని ఆరోపించారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యదీక్షతతో ఏపీని అభివృద్ధి చేసి తీరుతామని ఉద్ఘాటించారు. జగన్‌కి ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని.. దేనికైనా సమాధానం చెప్పడానికి కూటమి పార్టీల నాయకులు సిద్ధంగా ఉన్నారని, చర్చకు రావాలని ఎంపీ రమేశ్ సవాల్ విసిరారు. ఒక్కసారైనా అసెంబ్లీకి వెళ్తే జగన్‌కు సెల్యూట్ చేస్తా అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం చూడలేక వైఎస్ జగన్ భయంకర వాతావరణ సృష్టిస్తున్నారని మండిపడ్డారు.. పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్లు పోయినా ఇంకా జగన్ మారలేదన్నారు.. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలపై జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్న ఆయన.. గుజరాత్‌లో విజయవంతంగా నడుస్తున్న పిపిపివిధానాన్ని కూటమి ప్రభుత్వం ఇక్కడ అమలు చేస్తుందన్నారు.. 50 సంవత్సరాల రాజకీయ జీవితం ఉన్న అయ్యన్నపాత్రుడు గురించి జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.. స్పీకర్ అయ్యన్నపాత్రుని ఎదుర్కొనే ధైర్యం ఉంటే జగన్ ఒకసారైనా అసెంబ్లీకి వెళ్లాలని సూచించారు.. నీ కోసం ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరతానని తెలిపారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి వెళ్తే తన ప్రభుత్వంలో చేసిన అక్రమాలు బయటపడతాయన్న భయం ఉందని దుయ్యబట్టారు.. అసెంబ్లీని ఫేస్ చేయలేని ప్రతిపక్ష నాయకుడు జగన్ అని సెటైర్లు వేశారు..

## స్టాల్ ఇన్ మాల్‌తో గ్రామీణ హస్తకళాకారులకు చేయూత

### స్వయం సహాయక సంఘాల
### ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం
### పట్టణ ప్రాంత ప్రజల అభిరుచులకు తగ్గట్లు
### అందుబాటులో ఉత్పత్తులు
### జనవరి 9 వరకు స్టాల్ ఇన్ మాల్ ద్వారా
### ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు
### నగర ప్రజలు హస్తకళాకారులను
### ప్రోత్సహించేందుకు ముందుకు రావాలి
### నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహ్రా

**విజయవాడ,అక్టోబర్ 11:**
స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేటు షాపింగ్ మాల్స్‌లోనూ స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) ఎంఎం బెహ్రా అన్నారు. ‡బార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను శుక్రవారం నాబార్డ్ నాబార్డ్ డీజీఎం ఎంఎం బెహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు కళాత్మక సంపదను భావితరాలకు అందజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారి వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటి ప్రదర్శన, అమ్మకాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి సత్ఫలితాలనిచ్చాయన్నారు. ప్రస్తుతం ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శన జనవరి 9 వరకు ఉంటుందని.. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతారన్నారు. పీవీపీ మాల్‌లో ఏర్పాటుచేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను తిలకించి స్వయం సహాయక బృందాల మహిళల ఆర్థిక పురోగతికి చేస్తున్న ప్రయత్నంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎం బెహ్రా కోరారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ నాబార్డ్ సహకారంతో విశాఖపట్నం, విజయవాడ పట్టణాలలో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, ఒక్కో ప్రదర్శన 90 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. హస్తకళాకారులు, చేతివృత్తిదారులకు 15 రోజులపాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

### ఈనెల14న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బిసి బందుకు పిలుపు నిచ్చిన రాజ్యసభ సభ్యులు

# ఆర్ కృష్ణయ్యకు మద్దతుగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు..





ఏ ఎం న్యూస్ ఓయూ:
ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఈనెల14న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బిసి బందుకు పిలుపు నిచ్చిన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యకు మద్దతుగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపాయి. ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతు కామారెడ్డి డిక్లరేషన్లో ఇచ్చిన హామీ 42 శాతం బిసి రిజర్వేషన్లను అమలు పరచకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ జాప్యం చేయకుండ త్వరగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాజకీయ పరిష్కారాన్ని చూపాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి స్వామి గౌడ్, ఎస్ నాగేశ్వరవు, డాక్టర్ లక్ష్మిగారి ఆంజనేయులు ముదిరాజ్, ఓయూ శంకర్,నిఖిల్, నరేష్, జూలూరి మహేష్, శ్రీకాంత్, సాయిలు,రజనీకాంత్, రాకేష్, శివ, శ్రవణ్,శ్రీధర్, నగేష్, రాజేష్, సైదులు మరియు తదితరులు పాల్గొన్నారు.

### బన్సీలాల్ పేట్ కురుమ స్మశాన వాటిక

# పరిరక్షణకు న్యాయపోరాటం చేస్తాము

### - మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :





కురుమ సంక్షేమం కోసమే కేసీఆర్ ను వదిలి రేవంత్ రెడ్డి దగ్గర చేరడం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ, కుర్మసంఘం రాష్ట్రధ్యక్షుడు ఎగ్గే మల్లేశం స్పష్టం చేశారు. సికింద్రాబాద్ లోని బన్సీలాల్ పేట్ లో బన్సీలాల్ పేట్ కురుమ స్మశాన వాటిక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎగ్గే మల్లేశం పాల్గొని మాట్లాడుతూ బన్సీలాల్ పేట్ లోని కుర్మ సంఘానికి చెందిన 1965గజాల స్థలాన్ని కాపాడే పూర్తి బాధ్యతను తాను, రాష్ట్ర కుర్మసంఘమే తీసుకుంటుందని బన్సీలాల్ పేట్ కుర్మసంఘం ప్రతినిధులకు హామి నిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన స్థలాల్లో కుర్మసంఘం, గొల్ల సంఘం భవనాల నిర్మాణాలు మాత్రమే జరిగా యని, అందులో కేవలం కుర్మసంఘం భవనం మాత్రమే ప్రారంబ మయ్యిందని పేర్కొన్నారు. కురుమ సంఘమే రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నదని అన్నారు. బన్సీలాల్ పేట్ లోని ఈ స్మశాన వాటిక స్థలం కోసం మంత్రితో మాట్లాడడంతో పాటు కోర్టులో మంచి న్యాయ వాదిని పెట్టి కొట్లాడే బాధ్యత తనదేనని, అందుకు అయ్యే ఖర్చు మొత్తం రాష్ట్ర కుర్మసంఘం చూసుకుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ ఎగ్గా మల్లేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, కొండల్ రాజు, రాష్ట్ర కోశాధికారి రాష్ట్ర కోశాధికారి కట్ట మల్లేష్, జాయింట్ సెక్రెటరీ కొప్పుల నరసింహ, కుర్మా స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ న్యాయ వాది ప్రవీణ్, మంత్రి కళావతి, ఎం.పీ సునీల్, శివ ప్రసాద్, నాటరాజ్, సంతోష్, ఎం. వెంకట్ బాబు, దేనేష్, వి. రమేష్, వి.అరుణ్ కుమార్, ఎం. కుమార్, మమత,మల్లేశ్వరి,ఏ. అశోక్, మల్లేశ్వరి ఎం. పద్మ, బి. కిరణ్, ఎం. బాల కృష్ణ, సీ.హెచ్ శివ ఉన్నారు.

### డి.ఈ.వో.శామ్యూల్ రాజ్ సమక్షంలో పొట్లూరి అనురాధకు

# ఘనంగా వీడ్కోలు, పాల్గొన్న పరమేశ్వరమ్మ, స్కూల్ సిబ్బంది..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :
ఉపాధ్యాయ వృత్తిలో పొట్లూరి అనురాధ చేసిన సేవలకు కృతజ్ఞతగా వారి పదవి విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సభ ను శనివారం గవర్నమెంట్ స్కూల్( యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ ) ప్రాంగణంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సామ్యూల్ రాజ్ సమక్షంలో తమ స్కూల్లోని అధ్యాపకుల, టీచర్ల,తో పాటు విద్యార్థిని విద్యార్థుల మధ్య, వివిధ ప్రాంతాలలో ఆమె చేసిన స్కూల్లోని హెడ్ మాస్టర్ లను, అధ్యాపకులను ఆహ్వానించి వారి మధ్య ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు గవర్నమెంట్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయరాలు పి.పరమేశ్వరమ్మ. ఈ సందర్భంగా డి. ఈ. వో. శామ్యూల్ రాజ్ పొట్లూరి అనురాధ కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు ఆయన మాట్లాడుతూ వివిధ స్కూళ్లలో పొట్లూరి అనురాధ చేసిన సేవలను కొనియాడారు ప్రధాన ఉపాధ్యయురాలు పి.పరమేశ్వరమ్మ మాట్లాడుతూ నిబద్ధతకు నిదర్శనం పొట్లూరి అనురాధ అని అన్నారు టీచర్ వృతిలో ( ఇంగ్లీష్ సబ్జెక్ట్ ) మీరు చేసిన సేవలు విద్యార్థిని, విద్యార్థులకు ఎల్లప్పుడూ గుర్తుంటాయని అన్నారు ఈ కార్యక్రమం లో పొట్లూరి అనురాధ చేసిన వివిధ స్కూళ్ల హెడ్మాస్టర్లు,





టీచర్లు,ఉపాధ్యాయులు, వచ్చి తమతో ప్రయాణం చేసిన పొట్లూరి అనురాధ గురించిన విషయాలు వివరించి, అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థిని విద్యార్థుల మధ్య ఈ వేడుకను చాలా చక్కగా కన్నుల విందుగా నిర్వహించారు. పొట్లూరి అనురాధ దంపతులను, వారి కుమారుడు భార్గవ్, కుమార్తె ప్రేరణ చౌదరి మధ్య పూలమాలతో శాలువాతో ఘనంగా సత్కరించారు పొట్లూరి అనురాధకు విద్యార్థిని విద్యార్థులు కృతజ్ఞతగా కానుకను అందించారు ఈ కార్యక్రమానికి వచ్చిన అందరు పొట్లూరి అనురాధ తో చేసిన ప్రయాణం గురించిన అనుభవాలను పంచుకున్నారు పొట్లూరి అనురాధ మాట్లాడుతూ ఇంత ఘనంగా వీడ్కోలు పలికిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా డి ఈ ఓ సమక్షంలో ఈ కార్యక్రమం జరుపుకోవడం నేను మరిచిపోలేని రోజు అని పొట్లూరి అనురాధ అన్నారు విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలతో ఈ కార్యక్రమం కనుల విందుగా సాగింది.

# దేశ మొబిలిటీ వ్యాలీగా హైదరాబాద్

### ఫార్ములా ఈ-రేస్‌తో గ్లోబల్ హబ్‌గా నగరం ఆవిష్కరణల కేంద్రంగా టీ-హబ్, టీవర్క్స్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోయంబత్తూరులో 10వ ఎఫ్ఎంఏఈ



నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ పోటీలుప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ వీధుల్లో పరుగులు తీశాయి. భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందన్న విషయం దీంతో రుజువైంది. ఈ-రేసు రూ. 700 కోట్ల ఆర్థిక కార్యకలాపాలను సృష్టించి అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించింది.- కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 11 :
తమ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ-రేసు ఒక క్రీడా కార్యక్రమం మాత్రమే కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా మారిందని చెప్పేందుకు ప్రతీక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కోయంబత్తూరులో శుక్రవారం జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ పోటీలు-2025కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ నగర వీధుల్లో పరుగెత్తాయని, భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందన్న విషయం దీంతో రుజువైందని అన్నారు. ఈ రేసు దాదాపు రూ. 700 కోట్ల ఆర్థిక కార్యకలాపాలను సృష్టించి అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించిందని తెలిపారు. తెలంగాణ స్థిరమైన, సాంకేతిక ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యాన్ని కలిగి ఉందని, త్వరలోనే దేశ మొబిలిటీ వ్యాలీగా హైదరాబాద్ ఆవిర్భవించబోతున్నదని ధీమా వ్యక్తంచేశారు. మోటార్ స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదని, అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడమని, యువత కూడా తమ జీవితంలో రేస్ కారులా దూసుకుపోవాలని కేటీఆర్ సూచించారు.

**యువత ఉద్యోగాలు సృష్టించాలి**

వందల మంది యువ ఇంజినీర్లకు సందేశమిస్తూ అవకాశాల కోసం ఎదురు చూడకుండా, వాటిని వారే సృష్టించుకునే విధంగా ఎదగాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'యువత సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి?' అని ప్రశ్నించారు. 'ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, ఉద్యోగాలు ఇచ్చే యజమానులుగా మారాలి. పెద్ద కలలు కనడం ప్రారంభించాలి. ఆ తర్వాత తమ సామర్థ్యాన్ని చూసి తామే ఆశ్చర్యపోతారు' అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని గురించి ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు అసాధ్యమని చాలామంది సందేహం వ్యక్తంచేశారు. కానీ, ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డామని, తెలంగాణ సాధించిన ప్రగతి, విశ్వాసానికి పట్టుదలకు, దార్శనికతకు నిదర్శనంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. మోటార్ స్పోర్ట్స్ అయినా, పరిపాలన అయినా, జీవితంలో అయినా విజయం యాదృచ్ఛికంగా రాదని, మనం మన అవకాశాలను కల్పించుకుని, ధైర్యంతో వాటిని అమలు చేసినప్పుడే భవిష్యత్తు నిర్మితమవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

**ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్**

ఐటీ మంత్రిగా తన హయాంలో ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టీహబ్ దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రమైన టీవర్క్స్ అని, ఇటు వంటి సంస్థల ద్వారా తెలంగాణ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందిందని కేటీఆర్ వివరించారు. ఒక ఆలోచన టీహబ్ నుంచి టీవర్క్స్‌కు వెళ్లడానికి టీ తాగేంత సమయం మాత్రమే పడుతుందంటూ ఆలోచన అమలు వేగం గురించి చమతరించారు.

### జమాత్ ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

# ఈ నెల 14న గోదావరిఖని రాక..!

ఏ ఎం న్యూస్, గోదావరిఖని టౌన్ :




ఈ నెల 14న సమాజ శాంతి స్థాపనలిలిలి కోసం నైతిక విలువలతో కుడిన విశ్వాసం అనే మార్గాన్ని సత్యం అని నమ్మే సంస్థ జమాత్ ఇస్లామీ హింద్-అర్కాన్- సభ్యులు- బహిరంగ సభ ను ఎర్పాటు చేసి ముఖ్య అతిథిగా, జమాత్ ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ ను ఆహ్వానించ్చారు. స్థానిక లక్ష్మీనగర్లోని జమా మసీదులో జరిగే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతారు. మంథని, రామగుండం,మంచిర్యాల్, నియోజకవర్గలలోని ముస్లింలు అధిక సంక్యలో పాల్గోనాలనిలిలి అర్కాన్- కర్కునాన్ లిలిసభ్యులు -కార్యకర్తలు-కొరారు, గోదావరిఖని అధ్యక్షుడు సయ్యద్ జావిద్ అక్మల్ హుస్సేనీ- సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్, ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ- ఉపాధ్యక్షుడు, మహ్మద్ ఫసియుద్దీన్ - షరియత్ పంచాయితీ చైర్మన్ - వైస్ చైర్మన్ ముస్తఫా, అక్బర్ -నాజిమ్ ఎ హల్క కార్కునాన్ - రెహాజుద్దీన్- AIITA - ఆల్ ఇండియా ఐడిల్ టీచర్స్ అసోసియేషన్ -ఫయాజ్-పర్చెస్- సెల్-బహిరంగ సభ పోస్టర్ విడుదల చేసారు.

### ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు

# బుక్‌ను అందించిన డాక్టర్ రియాజ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సోమాజిగూడ డివిజన్ ఇంచార్జ్, డాక్టర్ రియాజ్ శనివారం ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ను మర్యాదపూర్వకంగా వారి క్యాంప్ కార్యాలయంలో కలిశారు మీనాక్షి నటరాజన్ కి తెలంగాణ చరిత్ర, మూమెంట్ ఆఫ్ తెలంగాణ, కల్చర్ గురించిన వివరాలతో స్వయంగా రాసిన మై బుక్ ( పుస్తకం)ను అందజేశారు..

# బ్రిటన్ మాజీ ప్రధాని రిషీ సునాక్ కొత్త అవతారం

### మైక్రోసాఫ్ట్ సలహాదారుగా బాధ్యతలు

**లండన్,అక్టోబర్ 11:**
భారత సంతతికి చెందిన బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ తాజాగా మైక్రోసాఫ్ట్ సలహాదారుగా నియమితులయ్యారు. మైక్రోసాఫ్ట్‌తో పాటు ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌కు కూడా ఆయన సలహాదారుగా వ్యవహరించనున్నారు. ఏఐ రంగంలో రెండు సంస్థలకు మార్గనిర్దేశనం చేసినందుకు గానూ పారితోషికం కూడా తీసుకోనున్నారు. బ్రిటన్ ప్రధాని బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత.. టెక్ రంగంవైపు రిషి సునాక్ మళ్లడం ఇదే తొలిసారి. ఇక రిషి సునాక్ నియామకానికి బ్రిటన్‌కు చెందిన అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ (ఏసీఓబీఏ) అనుమతించింది. బ్రిటన్ ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన 2023లో ఏఐ భద్రతకు సంబంధించి గ్లోబల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇక బ్రిటన్ ప్రధానిగా సేవలందించినందుకు రిషి సునాక్ విధులకు సంబంధించి ఏసీఓబీఏ పలు నిబంధనలు విధించింది. వీటి ప్రకారం, ఆయన మైక్రోసాఫ్ట్, ఆంత్రోపిక్ తరఫున బ్రిటన్ ప్రభుత్వంతో చర్చలు, లాబీయింగ్ వంటివి చేయకూడదు. బ్రిటన్ ప్రధానిగా చేసిన సమయంలో తనకు తెలిసిన కీలక సమాచారాన్ని ప్రస్తుత విధుల్లో వినియోగించకూడదు. బ్రిటన్ ప్రభుత్వ పరిధిలోని మైక్రోసాఫ్ట్ లేదా ఆంత్రోపిక్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదు. బ్రిటన్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన వారు ప్రైవేటు రంగంలోకి ప్రవేశించినప్పుడు ఎలాంటి చిక్కులు రాకుండా ప్రభుత్వం ఈ నిబంధనలను రూపొందించింది.

# శ్రీ కృష్ణా నగర్‌లో 236 పోలింగ్ బూత్ ఓటర్లని కలిసిన శాసనాల గాలయ్య..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



వచ్చే నెల( నవంబర్) 11 వ తారీకు జరిగే ఉప ఎన్నిక లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ను గెలిపించాలని యూసఫ్ గూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, సోషల్ వర్కర్, శాసనాల గాలయ్య శనివారం యూసుఫ్ గూడా పరిధిలోని శ్రీ కృష్ణానగర్ ఏ బ్లాక్ లో 236 పోలింగ్ బూత్ లోని ఓటర్లని కలిసి, వారిని కోరి,కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు 236 పోలింగ్ బూత్ లోని ఓటర్లు ను తన టీం తో,వారిని కలిసి వచ్చేనెల( నవంబర్) 11 వ తారీకు జరిగే ఉప ఎన్నిక లో వచ్చి ఓటు వేయాలని వారిని కోరారు ఈ సందర్భంగా శాసనాల గాలయ్య మాట్లాడుతూ ఇన్చార్జి హరి ఆదేశాల మేరకు శ్రీకృష్ణ నగర్ ఏ బ్లాక్ ప్రాంతంలో 236 పోలింగ్ బూత్ కి సంబంధించిన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

